గుంతలు పడి బురదమయంగా మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు

చుట్టూ కంపచెట్లు.. రోడ్డేమో గతుకులు

అధ్వానంగా మోడల్ స్కూల్‌కు వెళ్లే దారి

మఠంపల్లి, సెప్టెంబర్ 29 : మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌కు వెళ్లే రోడ్డు చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతున్నది. కమ్ముకున్న కంపచెట్లతో బురదమయంగా మారిన రోడ్డుపై అడుగు వేయలేని పరిస్థితి ఉంది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా వేర్వేరు మండలాల నుంచి కూడా విద్యార్థులు మఠంపల్లి మోడల్ స్కూల్‌లో చదువుతున్నారు. పాఠశాలకు వెళ్లే రోడ్డు కంపచెట్లతో నిండి ఉండడంతో విషపురుగులు, పాములు కరిచినా పట్టించుకునే నాథుడు ఉండడని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి మోడల్ స్కూల్‌కు రోడ్డు వేయించి, కంపచెట్లు తొలగించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ రామ్ నరేశ్‌ను వివరణ కోరగా.. తాను ఈ స్కూల్‌కు వచ్చి పది రోజులే అవుతుందని, రోడ్డు సమస్య గురించి పై అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మఠంపల్లి మోడల్ స్కూల్

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 29 : పట్టణంలోని ట్రిపుల్ ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నూతనకల్ నాగార్జున ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా దృఢ సంకల్పంతో పరిష్కారం చూపేందుకు కలసి కట్టుగా ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారగోని వెంకట్‌గౌడ్, ఉపాధ్యాయులు బొక్క వీరారెడ్డి, ఎం.దీన్‌దయాల్‌రెడ్డి, ఎం.సోమిరెడ్డి, మంజుల, లింగయ్య, వెంకట్‌రెడ్డి, శ్యామ్, శరత్, పూర్వ విద్యార్థులు ఉపేందర్‌రెడ్డి, దేవేందర్, రాజశేఖర్, చంద్రయ్య, లక్ష్మణ్, ఉమ, కవిత పాల్గొన్నారు.

వన భోజనాలకు తరలుతున్న గ్రామస్తులు

వన భోజనాలు

చిలుకూరు, సెప్టెంబర్ 29 : మండలంలోని నారాయణపూరం గ్రామస్తులు ఆదివారం వన భోజనాలకు వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి, కుటుంబ సమేతంగా చెట్ల కిందికి వెళ్లి సామూహిక బోజనాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, పల్లా రామిరెడ్డి, జానకిరాములు, మండవ చిన్న, బూర లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి : ప్రభాకర్ గౌడ్

నూతనకల్, సెప్టెంబర్ 29 : రైతు భరోసా డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా ఇస్తానని చెప్పి 9 నెలలు గడుస్తున్నా డబ్బులు జమ చేయలేదని మండి పడ్డారు. ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని, ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు వీరన్న, సైదులు, లింగమల్లు, అయిలయ్య, పుల్లయ్య, అయోధ్య ఉన్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయాలి

- ఉపాధ్యాయుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం
- పాఠశాలలను గాలికొదిలేసిన ప్రభుత్వం
- టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సూర్యాపేట అర్బన్/రూరల్, సెప్టెంబర్ 29 : ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయాలని, విద్యారంగ సమస్యలపై పోరాడే ఏకైక సంఘం యూటీఎఫ్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన టీఎస్ యూటీఎఫ్ 5వ జిల్లా మహాసభలకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగు పడాలంటే ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని పటిష్టం చేస్తే, దాన్ని నిర్వీర్యం చేసిన ఘనత కాంగ్రెస్ దేనని విమర్శించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సరిపడా నిధులను కేటాయించి ప్రాధాన్యత కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సర్కారు విద్యపై ప్రజల్లో విశ్వాసం లేకుండా పోయిందని మండి పడ్డారు. విద్యారంగాన్ని కాపాడడం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యతోనే భవిష్యత్ పౌరులు తయారవుతారన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జంగయ్య, చావా రవి, రాములు, నాగమణి, మంగ, ధనమూర్తి, రమేశ్‌బాబు, యాకయ్య, అరుణ, కమల, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రంగారావు జీవితం భావితరాలకు ఆదర్శం : మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్ : టెక్నీషియన్‌గా జీవితాన్ని ప్రారంభించి కార్మిక నాయకుడిగా ఎదిగి ఎందరో కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన పెద్దిరెడ్డి రంగారావు జీవితం భావితరాలకు ఆదర్శనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. స్థానిక త్రివేణి ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పెద్దిరెడ్డి రంగారావు పదో వర్ధంతి కార్యక్రమంలో ఆయన హాజరై చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు కేవీఎల్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ సభ్యుడు వై.వెంకటేశ్వర్లు, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్, గండూరి ప్రకాశ్, అనంతుల మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్, పెద్దిరెడ్డి గణేశ్, పెద్దిరెడ్డి రాజా, చంద్రశేఖర్, వెంకటకృష్ణ, ప్రసాద్, మధు పాల్గొన్నారు.

సత్తార్ సార్‌కు నివాళి : పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్‌లో ఏర్పాటు చేసిన సత్తార్ సార్ సంతాప సభలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్తార్ సార్ దగ్గర ఆయన కొంత కాలం చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. చివరి శ్వాస వరకు సాధారణ జీవితం గడిపిన ఘనత సత్తార్ సార్‌దేనన్నారు.

డప్పు కళాకారుడు సతీశ్‌కు అక్షర పురస్కారం

అవార్డు అందుకుంటున్న డప్పు కళాకారుడు సతీశ్

గరిడేపల్లి, సెప్టెంబర్ 29 : మండలంలోని అప్పన్నపేటకు చెందిన డప్పు కళాకారుడు అమరవరపు సతీశ్ సాంస్కృతిక విభాగంలో రాష్ట్ర స్థాయి అక్షర ప్రతిభా పురస్కారం అందుకున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ డప్పు కళాకారుడిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త మీలా వాసుదేవ్, అక్షర ఫౌండేషన్ ఫౌండర్ యాస రామ్‌కుమార్‌రెడ్డి ఆయనకు పురస్కారం అందించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న పారేపల్లి శేఖర్

నేరేడుచర్ల, సెప్టెంబర్ 29 : ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం అరిబండి భవన్‌లో ఆదివారం జరిగిన పార్టీ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హులకు ఎదురు చూపులు తప్పడం లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొదమగుడ్ల నగేశ్, తిరుపతయ్య, రామ్మూర్తి, మీనయ్య, ఆసిఫ్, సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేతలకు తాత్కాలిక విరామం ప్రకటించాలి : సీపీఐ

నేరేడుచర్ల, సెప్టెంబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ఇళ్లను కూల్చివేస్తుందని, వాటికి తాత్కాలిక విరామం ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ధనుంజయనాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి : సీఐటీయూ

మేళ్లచెర్వు, సెప్టెంబర్ 29 : సిమెంట్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టిపు సైదులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరాల సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెరుగక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలీ చాలని వేతనాలతో వారు జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట వెంకన్న, జానీ ఉన్నారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలి : వెంకటేశ్వర్‌రావు

నడిగూడెం, సెప్టెంబర్ 29 : రైతుభరోసా నిధులను విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బృందావనపురంలో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బెల్లంకొండ సత్యనారాయణ, మిట్టగడుపుల ముత్యాలు, శ్రీనివాస్, సోమయ్య, వెంకన్న, వెంకటనారాయణ పాల్గొన్నారు.

కష్టజీవులకు అండగా నిలిచేది సీపీఐ : సత్యం

అర్వపల్లి, సెప్టెంబర్ 29 : ప్రజా సమస్యలపై పోరాడుతూ కష్ట జీవుల హక్కుల సాధన కోసం ఉద్యమించేది సీపీఐ పార్టీ మాత్రమేనని ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామ శాఖ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. సమావేశంలో శ్రీను, అయిలయ్య, సైదులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు

నేరేడుచర్ల , సెప్టెంబర్ 29 : పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పురుషోత్తంరెడ్డికి నివాళి

గరిడేపల్లి, సెప్టెంబర్ 29 : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తంరెడ్డికి మండల కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, జుట్టుకొండ సత్యనారాయణ తదితరులున్నారు.

మఠంపల్లి/హుజూర్ నగర్ : నలమాద పురుషోత్తంరెడ్డి మరణం బాధాకరమని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు.

ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : తాసీల్దార్

నూతనకల్, సెప్టెంబర్ 29 : మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో నేడు జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని కోరారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభవుతంద తెలిపారు.

దామగుండం అడవులను కాపాడడమే లక్ష్యం : పవన్

గరిడేపల్లి, సెప్టెంబర్ 29 : వికారాబాద్ జిల్లాలోని దామగుండం ఫారెస్ట్‌ను కాపాడడమే అంతిమ లక్ష్యంగా పోరాడాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బొజ్జ పవన్ అన్నారు. గరిడేపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దామగుండం ఫారెస్ట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 3వేల ఎకరాల భూమిని, 12లక్షలకు పైగా చెట్లను కాల్చివేసి అందులో నేవీ రాడార్ స్టేషన్‌ను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం అనుమతులు తీసుకుందన్నారు. హైదరాబాద్ ప్రజలకు దామగుండం అడవుల వల్లే ఆక్సిజన్ అందుతుందని, అక్కడ నేవీ స్టేషన్ నిర్వహిస్తే రేడియేషన్‌కు పర్యావరణం, పక్షులకు తీవ్ర హాని జరుగుతుందన్నారు.

కోదాడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడలను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

విద్యార్థి దశలోనే సామాజిక ధృక్పథాన్ని అలవర్చుకోవాలి

- పీడీఎస్‌యూ

కోదాడ, సెప్టెంబర్ 29 : విద్యార్థి దశలోనే సామాజిక ధృక్పథాన్ని అలవర్చుకోవాలని పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థి, రాష్ట్ర నేత రాయపూడి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. సంఘం అర్ధ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలను పూర్వ విద్యార్థులు పెదనాటి వెంకటేశ్వర్లు, ముత్తవరపు పాండురంగారావు, పందిరి నాగిరెడ్డి, పారా సీతయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ జార్జిరెడ్డి అమరత్వంతో ఆవిర్భవించిన పీడీఎస్‌యూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సమస్యల పరిష్కారానికి ఉద్యమించడంతో పాటు సామాజిక సమస్యలపై పోరాటం చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మట్టారెడ్డి, పాకనాటి రాఘవరెడ్డి, డీఎన్ స్వామి, రాపర్తి రామనర్సయ్య, ఎన్.హరికిషన్‌రావు, కోటయ్య, మస్తాన్, వీరభద్రం, మల్లయ్య, ఉదయగిరి, వి.నరసింహారావు, చెందరావు, ఎంఈఓ సలీంషరీఫ్, పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డి అన్నదాన సత్రం కమిటీ సమావేశం

ఫంక్షన్ హాల్ స్లాబ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

మఠంపల్లి, సెప్టెంబర్ 29 : మండల పరిధిలోని మట్టపల్లి నృసింహుడి ఆలయంలో గల రెడ్డి అన్నదాన సత్రం కమిటీ సమావేశం చైర్మన్ పాముల వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్రం అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సత్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ స్లాబ్ నిర్మాణం పూర్తయిందని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు దాతలు అన్నదాన సత్రంలో మౌళిక వసతుల కల్పనకు విరాళాలు అందించారు. కార్యక్రమంలో రెడ్డి అన్నదాన సత్రం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు

దివ్యను సన్మానిస్తున్న జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 29: పట్టణంలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన అండర్-12, 15 చదరంగ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో 124 మంది క్రీడాకారులు పాల్గొనగా రమ్య, దీక్షిత్, రక్షిత్ చారి, శ్రీవాత్సవ్, సాయి కార్తికేయ విజయం సాధించినట్లు చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. అనంతరం సూర్యాపేటకు చెందిన ఆన్‌రేటెడ్ ఆఫ్ ది వరల్డ్ అవార్డు గ్రహీత దివ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నర్సింహారావు, రవి కుమార్ పాల్గొన్నారు.

కూలిన ఇంటి పైకప్పు

హుజూర్‌నగర్‌లో కూలిన ఇంటి పైకప్పు

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 29 : పట్టణంలోని 15వ వార్డులో పొనుగుపాటి వెంకటేశ్వర్‌రావుకు చెందిన ఇంటి పైకప్పు ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా కూలిపోయింది. ప్రస్తుతం ఆ ఇంట్లో పిల్లుట్ల నరేశ్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. పైకప్పు కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పురాతన ఇల్లు కావడంతోనే పైకప్పు కూలిందని, టీవీ, ఫ్రిజ్, మంచం, ల్యాప్ టాప్‌తో పాటు ఇతర సామగ్రి ధ్వంసమైనట్లు బాధితుడు తెలిపాడు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

లకావత్ శ్రీను (ఫైల్)

మద్దిరాల, సెప్టెంబర్ 29 : మండలంలోని కుక్కడం ఆవాసం రాజగాని తండాలో భూ తగాదాల విషయంలో మనస్థానం చెంది ఓ యువకుడు శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లకావత్ శ్రీను (26)కు అదే తండాకు చెందిన లకావత్ రెడ్యా, లకావత్ రవి, లకావత్ సురేశ్ మధ్య కొంతకాలంగా భూముల విషయంలో పంచాయితీలు జరుగుతున్నాయి. ఈ విషయంలో పలుమార్లు పెద్ద మనుషులు తీర్మానం చేసినా వారి తీరులో మార్పు రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీను ఈనెల 28న రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, మూడేండ్ల కుమార్తె, ఏడాది కుమారుడు ఉన్నారు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనునాయక్ తెలిపారు. అదే విధంగా తండాలో హింసాత్మక ఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెండింగ్ బిల్లులకు మోక్షమెప్పుడో?

- ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా పంచాయతీ బిల్లుల ఊసులేదు
- అప్పులు తీరేదెలా అని మాజీ సర్పంచ్‌ల ఆవేదన
- పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని వేడుకోలు

మర్రికుంటతండాలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయం

తిరుమలగిరి, సెప్టెంబర్ 29 : గత ప్రభుత్వం తండాలను గ్రామపంచాయతీలుగా చేసి, వాటికి పక్కాభవనాలు మంజూరు చేసి ఒక్కో భవనానికి రూ.20 లక్షల నిధులు కేటాయించింది. చాలా చోట్ల సర్పంచ్‌లు గ్రామ పంచాయతీ పక్కా భవనాలు నిర్మాణం పూర్తి చేశారు. కొన్ని చోట్ల భవనాలు నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో పాటు సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. కొత్త ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందని భావించిన మాజీ సర్పంచ్‌లకు నిరాశే మిగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవటంతో చేసిన అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నామని మాజీ సర్పంచ్‌లు అంటున్నారు. వెంటనే ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

తొమ్మిది భవనాలు మంజూరు..

మండలంలో 16 గ్రామ పంచాయితీలుండగా అందులో తొమ్మిది తండా జీపీలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. ఈజీఎస్ నిధుల కింద 4 జీపీలకు, ఎస్టీ కోటా కింద మరో 5 జీపీలకు నిధులు కేటాయించారు. ఈజీఎస్ కింద మంజూరైన చింతలకుంట, మర్రికుంట తండాల పంచాయతీ భవనాలకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు నిర్మాణం పూర్తి చేశారు. కానీ నేటికీ ఒక్కపైసా కూడా రాలేదు. అప్పులు తెచ్చి భవనాలు పూర్తి చేశామని, వాటిల్లో నేడు ప్రభుత్వం పంచాయతీ కార్యక్రమాలు నిర్వహించుకుంటుంది కానీ తమకు మాత్రం పెండింగ్ బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే సిద్దిస ముద్రం, మొండిచింత, కోటియా, కోక్యనాయక్, కన్నారెడ్డికుంట, రాఘవపురం, రాజా నాయక్ తండాల్లో కొత్త గ్రామ పంచాయతీ భవనాల పనులు నిర్మాణ దశల్లో ఉన్నాయి. వీటికి తోడు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణకు డబ్బులు సొంతంగా ఖర్చు పెట్టామని వాటి పెండింగ్ బిల్లులు కూడా ఇప్పటి వరకు ప్రభుత్వం చెల్లించటం లేదని మాజీ సర్పంచులు అంటున్నారు.

ఇప్పటి వరకు చిల్లిగవ్వ రాలేదు

రూ.20 లక్షలు తెచ్చి పంచాయతీ భవనం నిర్మాణం చేపట్టి ఏడాది కావస్తుంది. ప్రభుత్వం ఇప్పటి వరకు చిల్లిగవ్వ కూడా చెల్లించలేదు. చేసిన అప్పులు తీర్చలేక నానా అవస్థలు పడుతున్నా. ప్రభుత్వం మా సమస్యను గుర్తించి వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

– రవినాయక్, మాజీ సర్పంచ్, చింతలకుంట తండా

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

ప్రభుత్వం గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులను అస్సలు పట్టించుకోవడం లేదు. మేము ఎంతో కష్టపడి కొత్త పంచాయతీ భవనాలు ఏర్పాటు చేసుకున్నాం. బిల్లులు ఇవ్వాల కాకుంటే రేపు వస్తాయి అనుకున్నాం. 10 నెలలు దాటినా ప్రభుత్వం బిల్లు ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. బిల్లులు మంజూరు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి.

– దేవానాయక్, మాజీ సర్పంచ్, మర్రికుంటతండా